# చౌరస్తాలో బాపూజీ

–చాహా శీలకోటి




**పొద్దుపొడుపు చూడముచ్చట గొలుపుతున్నది.**

**కళ్లాపి చల్లి, వాకిలిన ముగ్గేయడానికి వచ్చిన శాంత - భూమిని వెనక్కి నెడుతూ పైకి ఎగబాకుతూ వస్తున్న ఎర్రముద్దలాంటి సూర్యుణ్ణి చూసి అట్టాగే ఉండిపోయింది.**

'**ఓలబ్బో!** ఏమందం! కన్నులారా చూడాలే తప్ప, చెపితే ఏం తీరతది?'

సూర్యుడు భూమిని ఎడబాసి, అప్పటిదాకా ఉన్న లేతదనాన్ని మార్చుకుని పైకి కదులుతూ, ఇంద్రధనుస్సులాంటి రంగులను కరుకెక్కిస్తూంటే, భూమిపై పరచుకుంటున్న కాంతిరేఖలు తెలివెచ్చదనాన్ని పులుముకుంటుంటే - ఈ ప్రకృతికున్న అన్ని అందాలను ఈ మనిషి ఇప్పటికి చూశాడా? అనిపిస్తది.

ఈ పొద్దుపొడుపుతోనే లోకం ఒళ్లు విరుచుకుని చీకటి మగతను వదిలించుకుని బతుకుబాటకు మళ్లుతది!

శాంత చూసినంతసేపు తొలిపొద్దు అందాల్ని చూసి, ముగ్గేసేందుకు వంగింది. పైట చెరగు గబుక్కున నేలకు జారింది.

ఆజా బాజాల్లో ఎవరూ లేకున్నా, అలవాటు చొప్పున గబుక్కున ఎదవరకూ పైట చెరగును మొదట గుంజుకుని కప్పుకుంది. చుట్టూరా ఒక్కసారి పారాజూచి నిబ్బరంగా నిలబడి, చెరగును నడుంన దోపుకునీ, వంగి ముగ్గుకర్ర వేసింది. ముగ్గు పూర్తియ్యాక లేచి, వేసినదాన్ని చూసింది. 'పద్మవ్యూహం' ముగ్గది. ముచ్చటగా కుదిరినట్టనిపించింది. తృప్తిగా నాలుగువైపులా నాలుగు ముగ్గుకర్రలేసి లోనకు నడిచింది. ముగ్గుబుట్ట కిటికీలో పెట్టి, పడకగదిలోకి తొంగిచూసింది.

పిల్లవాడు కళ్లు నులుముకుంటూ మంచం దిగే ప్రయత్నాన కనిపించాడు. గబగబా మంచందాకా నడిచి, పిల్లాణ్ణి గారాం చేస్తూ కిందకి దింపింది.

'పిల్లాణ్ణి బడికి పంపించిందాకా ఏ పనీ తెమలదు! కుదార్తంగ గాలి పీల్చుకొనే అవకాశమూ దొరకదు!' అనుకుంటూ బాత్‌రూమ్‌కు తీసుకెళ్లి మొహం కడిగించి, ముద్దు చేస్తూనే తుడిచి, పాలు వెచ్చబెట్టి, చల్లార్చి తాగించి, ప్రయివేటుకు గడప దాటించి "జాగ్రత్తగా పక్కనే వెళ్లు!" అని చెప్పి కొంత దూరం నడిచిందాక చూసి, "హమ్మయ్య!" అనుకుంటూ వెనుతిరిగింది.

లోనకొచ్చి పిల్లాడి పక్కగుడ్డలు తీస్తుంటే 'కొడుకుని ప్రైవేటుకు పంపావుగదా! ఇక నా పని చూడు!' అన్నట్టు భర్త కనిపించాడు.

పట్టనట్టుగ వంటింటివైపు నడిచింది. తొలిపిన అంట్లను స్టౌ దగ్గరకు చేర్చి నిల్చుంది. అకస్మాత్తుగా నడుంను రెండుచేతులు వెనకనుంచి చుట్టేయడంతో ఉలిక్కిపడి, వెనక్కి తిరిగింది విదిలించుకుంటూ. ఇంకొంచెం ముందుకొచ్చే మూడ్‌లో మగడు కనిపించాడు.

"నేను చేస్తున్నదేంటి? ఇక్కడనా మీ బేతాళం?" అని దూరం జరిగింది.

"ఆఫీసుకు త్వరగా వెళ్లాలోయ్! మొదట కాఫీ కలుపు!" అన్నాడు బాధగా మొహం పెట్టి.

"నేను కాఫీ పెట్టనన్నానా, లేక ఆఫీసుకు త్వరగా వెళ్లొద్దన్నానా? ఇంతోటి సంగతి చెప్పడానికి ఇట్టా రావాలా?" అంది కోపంగా.

"టిఫెను రెడీ అయిందా?" అడిగాడు కొంచెం అడుగు జరుపుతూ.

"మీరు మొదట స్నానం చేసి రండి! ఈలోపు రెడీ చేసి టేబుల్‌పై పెడతాను!" అంది 'ఇక దయచేయండి!' అన్నట్టుగా చూసి.

❁ ❁ ❁

ఎనిమిదిన్నర కావస్తున్నది.

బాబింకా రాలేదేమిటని గడపదాకా వచ్చింది. వస్తూ కనిపించాడు కొడుకు.

లోనకు మామూలుగా రాలేదు.

టీచరేమన్నా అన్నాడేమోలే! ఏమీ అనంది చదువెలా వస్తుంది అనుకుంది.

'బాబూ' అంది చేతులు చాపి. ఆగమన్నట్టుగా చూసిన బాబు- వీపున ఉన్న సంచిని కిందపడేసి, దగ్గరికొచ్చాడు.

'ఏంటీ' అంది. బాబు తలను నిమురుతూ-

తలెత్తి అమ్మకళ్లలోకి చూసి 'అమ్మా! నడిరోడ్డునున్న గాంధీతాత ఏడుస్తున్నాడెందుకు?' అనడిగాడు చిత్రంగా కళ్లు తిప్పుతూ.

ఉలిక్కిపడ్డది శాంత. 'గాంధీతాతేమిటి- ఏడ్వడమేమిటి? ఆ మహానుభావుడు భౌతికంగా పోయి నలభై అయిదేళ్లు దాటింది. ఈమధ్య బ్రతికెపుడొచ్చాడు? వస్తే దేశమింకా ఇలాగెందుకుంటది - 'రోడ్డుపైనున్న బాపూజీ కంచువిగ్రహం కన్నీరిడువడంలేదుగదా?' అనుకుని అర్థంగాక, అయోమయంగా చూసింది.

బాబు 'నిజమమ్మా! మేం ప్రైవేటునుంచి వస్తుంటే గాంధీతాత ఎదురుగా కనిపిస్తాడుగదా? వస్తూ మామూలుగా ఆయనవైపు చూసాను. ఆయనకళ్లెంట నీరు జారుతూ కనిపించింది. నిజం మమ్మీ, మన రామక్రిష్ణమామయ్యగారి సుభాష్ లేడూ, వాడిని ఆపి చూపాను. వాడు చూసి నిజంగా తాతగారేడుస్తున్నారురా, దుమ్ముగానీ కంటిలో పడిందేమో తుడిచి వెళ్దామేం? అన్నాడు. ఆయనేమో చానా ఎత్తున ఉండి మాకయితే అందదుగదా? నిచ్చెన అక్కడ కనిపించలేదు. కనుక ఊరికే తిరిగొచ్చాం' అన్నాడు నిక్కరు విప్పుకుంటూ.

'ఇది నిజమా?' అనుకుని లోనకు చూసింది. భర్తరాజు ఇంటలేడు- బ్యాంకుకెళ్లాడు. వెంటనే అనిపించింది- 'ఇట్లాంటిదేది వచ్చినా ఈయన ఇంటిపట్టున ఉన్నదెప్పుడు? బాంకులో ఎవ్వరికీ ఉండని పని ఈయన కుంటుంది' అని విసుక్కుంది.

'శాంతా కొంచెం ఈపాలు ఫ్రిజ్‌లో పెట్టవోయ్, వరంగల్లు దాకా వెళ్లిరావాల్సొచ్చింది' అంటూ రుక్మిణి లోనికొచ్చింది.

గిన్నె తీసుకుని లోనికి నడిచింది శాంత.

అక్కడే కనిపించిన 'బాబు'ను దగ్గరికి తీసుకుంటూ 'ఇవ్వాళ్ల స్కూల్‌నేం చేసావ్?' అనడిగింది.

'ఏం చేయలేదు. వెళ్లాను' అన్నాడు.

'మొన్న గాంధీ జయంతినాడు మీ స్కూలు కుర్రాడొకడు 'గాంధీతాత వేషం కట్టాడట' అంది.

'మీరు రాలేదుగా ఆంటీ? ఎవరు చెప్పారు?' అడిగాడు.

'లోకల్ టి.వి. వాళ్లు చూపారు. నువ్వా గుడ్డివానిలా కనిపించావు కదూ?' అంది.

'అవును. నాకు ప్రైజొచ్చింది.' అని గొప్పగా చూసి, 'ఆంటీ మన సెంటరులోని గాంధీతాత లేడూ, పాపం ఆయన ఏడుస్తున్నాడు. మేం ట్యూషన్‌నుంచి వచ్చేపుడు చూసాం' అన్నాడు సీరియస్‌గా-

'గాంధీబొమ్మ, ఏడవడ మేంటీ?' అని రుక్మిణి విస్తుపోతుండగానే శాంత బయటకొస్తూ, 'ఆఁ! వీళ్లు చూసారట, చిత్రంగా ఉంది కదూ' అంది.

'శాంతా! శాంతా! మాపాప గాంధీ బొమ్మకళ్లెంట నీరొస్తుందని చెపుతున్నదేం' అంటూ గబగబా కిందికొస్తూ కనిపించింది చంచల.

ఈ మాటలు విన్న పనిమనిషి లచ్చువమ్మ- 'బ్రహ్మంగారు ఇట్టాంటివి ఇంకా చానా చెప్పాడటమ్మా!' అంది-

పది నిముషాలలో ఏడెనిమిదిమంది పోగయ్యారు.

"ఏందీ చోద్యం, ఈడనేగదా! చూసొస్తే పోలే!" అందో ఇల్లాలు.

కట్టగా బయలుదేరారు.

రాంబాయమ్మ కూరగాయల సంచితో ఎదురయి, "పేరంటమెక్కడ?" అనడిగింది. 'తనకు చెప్పలేదేంటీ?' అనుకుని.

కౌశల్య గబగబా గాంధీగారి సంగతి చెప్పింది, మరొకరికా ఛాన్సు ఇవ్వకుండా.

నోరెళ్లబెట్టి అలాగే ఓ క్షణం చూసి, తేరుకుని "పిల్లాడు చెప్పగానే బోలోమని వెళ్లడమేనా! అసలే ఎన్నికల రోజులు! వినాయకుడిపాలులా అవడానికి ఆయనేం దేముడు కాదు గదా!" అంది అనుమానంగా.

"నిజం! నిక్కచ్చిగా చెప్పినారు పిల్లలు!" అన్నారు చంచల, శాంతా.

"ఇదేం చాదస్తమే! కంచువిగ్రహం కళ్లనుంచి నీరేమిటి?" అని సణుగుతూనే వారిననుసరించింది.

పదడుగులు నడిచారు. ఇంకో నలుగురు కలిశారు. వాళ్లకూ తెలిపారు.

"అదిగో, గాంధీ బొమ్మ!" అని దూరాన చౌరస్తానున్న బొమ్మను చూపి, నడక వేగం పెంచింది కౌసల్య.

"దగ్గరగా చూడంది కళ్లవెంట జారేదెలా తెలుస్తది? ఒకావిడ.

నడక మాత్రం ఊపందుకుంది.

ఇంతలో ఓ గుంపు ఉత్తరదిశ నుంచి గాంధీబొమ్మ దగ్గరకొచ్చి ఆగింది - "జై!జై! జిందాబాద్!" అని పెద్దగా కేకలు పెడుతూ. నలుగురి చేతుల్లో ఖద్దరు దండలు కనిపించినాయి. బహుశా ఆయనకుగానీ వేస్తారేమో!

స్పీడందుకున్న ఆడంగుల నడకకు బ్రేకు పడింది. ఆగారు.

"నిచ్చెన ఏదిరా?" అన్నాడొకడు. దానికోసం నలుగురు పరుగెత్తారు.

ఇంతలో దక్షిణదిశనుంచి తప్పట్లు తాళాలతో, జయజయధ్వానాలతో మరోగుంపు గులాల్ చల్లుకుంటూ ఉత్సాహంగా అక్కడికి చేరుకున్నది. వారిచేతుల్లోనూ దండలున్నాయి.

నిచ్చెన తెచ్చి గాంధీగారి బొమ్మకు వేశాడొకడు.

"ఏయ్! ఇక్కడకు మేం ముందొచ్చాం! ఏంటా పరుగు! ఆగు!" అన్నారిద్దరు - మొదట వచ్చిన పార్టీనుంచి ముందుకు వచ్చి.

"వస్తే? దండ లెయ్యకుండా మేం ఆగమన్నామా?" అన్నారివతల పార్టీవాళ్లు.

"నిచ్చెనకోసం వెళ్లాడయ్యా!"

"మాకు నిచ్చెనుంది. మేం ఆగాల్సిన పనేముంది?" అని నిచ్చెన వేశారు రెండో పార్టీ.

"ఆగమంటుంటే మీక్కాదూ? మొదటి దండ మీది పడితే బాగుండదు!" అన్నారు మొదటి గుంపు ముందుకు జరుగుతూ.

"అసలీ బొమ్మ వేయించింది మా తాతగారు. మీరెవరు?" అన్నాడో యువకిశోరం.

"అట్టనా? పూజ గదిలో పెట్టించుకోకపోయావ్? నడిరోడ్డునెందుకేసినట్టు? ఎవడి జాగీరిది?" అంటూ నిచ్చెనను పట్టుకుంది మొదటి పార్టీ.

"గాంధీజీకీ జై! బాపూజీ జిందాబాద్!" నిచ్చెన వేసే ప్రయత్నం చేసింది రెండో పార్టీ.

అంతా గాంధేయవాదులే గదా! చెరోపక్క సత్యాగ్రహం చేస్తారనుకుని ఆడంగులు చూస్తూండగానే కర్రలు లేచినయ్, కత్తులు మెరిసినయ్. సోడాబుడ్లు గాంధీగారి తలపై నుంచి ఎగిరినయ్. కర్రలూ, కత్తులూ చకచకా కలిశాయి. పోరు మొదలైంది. కేకలు, హాహాకారాలు, పరుగులు, తొక్కిసలాటలు, ఏడుపులు, రక్తం చిందడాలు, నేలకొరిగి గిలగిలలాడడాలూ, కొట్లాట విసురుకు దుమ్ము రేగి సరిగ్గా కనిపించకుండా పోయింది.

మధ్యలో ఓ కేక - "వాడు పెట్టిన బొమ్మ ఈడ ఉండటమేంటి?" అని.

**పిచ్చోడు**

నిద్రపట్టక బాధపడుతున్న తాతయ్యను హిప్నాటిస్ట్‌కు చూపించారు. తాతయ్యను పడుకోబెట్టి కళ్లమీద నెమ్మదిగా చేత్తో నిమురుతూ, "ఇప్పుడు నీ కనురెప్పలు బరువుతో మూసుకుపోతున్నాయి. నీకు మెల్లిమెల్లిగా నిద్ర వస్తోంది. ఇదిగో ఇప్పుడు నీవు గాఢనిద్రలో ఉన్నావు" అన్నాడు హిప్నాటిస్ట్. తాతయ్య నిద్రలోకి జారుకున్నట్టు అనిపించగానే "తాతగారికి నిద్రాభంగం కలిగించకండి" అంటూ నెమ్మదిగా గదిలోంచి వెళ్లిపోయాడు.
ఓ రెండు నిమిషాలతర్వాత తాతయ్య నెమ్మదిగా కళ్లుతెరిచి సంతోషంగా అన్నాడు: "హమ్మయ్య... ఆ పిచ్చోడు వెళ్లిపోయాడన్నమాట!"

**టి.వి. ప్రసాద్**, నాగార్జునసాగర్

దానితో ఒక వర్గం గాంధీబొమ్మను కూల్చేందుకు, మరోవర్గం దాన్ని నిలిపేందుకూ పోరు మొదలైంది.

గాంధీగారి చేతికర్ర ముక్కలై కిందపడింది. దానితో మూడు పుచ్చెలు ఫట్‌ఫట్‌మనడమూ, కిందికి ఒరిగిపోవడమూ జరిగిపోయింది. పై నుంచి సోడాలు పేలుతున్నాయి. రాళ్లు పడుతున్నాయి.

అయినా కొట్లాట ఆగడంలేదు. ప్రతివానిలోనూ తెగింపుతనంతో యుద్ధభూమి అయింది గాంధీ చౌక్.

ఆడవాళ్లు ఆ బీభత్సాన్ని చూడలేక చిందరవందరై తొక్కుకుంటూ తోసుకుంటూ వీధినపడ్డారు. కొందరు పెద్దగా ఏడ్చారు. కొందరు కళ్లు మూసుకుని చతికిలపడ్డారు. ఒకరిద్దరు పరుగెత్తబోయి, నిస్సత్తువగా కిందపడి పరిగెత్తుతున్నట్టే నేలమీద పాకుతున్నారు. వాళ్లను తొక్కుతూ కొందరు పరుగెత్తారు. కొందరు స్పృహ కోల్పోయారు.

అప్పుడు వినిపించింది పోలీసు జీపు సైరను. అది ఒక్కటే రాలేదు. దానెంట పోతున్న వాన్లూ వచ్చి ఆగినయి. జీపునుంచి ఆగమని మైకున పోలీసులు చెప్పారు. ఆ వెంటనే గాస్ వదిలారు. ఒకటి రెండు రౌండ్లు గాలిలోకి పేల్చారు. వాన్ నుంచి బిలబిలా దిగినవారు దిగినట్టు అందినవార్ని అందినట్టు బాదసాగారు.

నేలంతా రక్తమయమైంది. పడి కొట్టుకుంటున్నవారు నేలమీద ఉంటే, ముఖం చూడకుండా మిగిలినవాళ్లను చావచితకకొట్టి ప్రశాంతతను దిగ్విజయంగా కాపాడారు.

పారిపోయినవారు పోగా, నేలపైనున్న వాళ్లను వానులో పడేశారు పోలీసులు.

కొట్టినంత అర్జంటుగా వైద్యం చేయించాలి కదా!

ఆనక నాలుగయిదు హెచ్చరికలు మైకున చేసి, నలుగురు సాయుధ పోలీసులను అక్కడ వదిలి సైరన్ మోగించుకుంటూ వెళ్లిపోయారు.

శ్మశాన ప్రశాంతత అప్పుడు నెలకొన్నది. ఎగిసిన దుమ్ము పొగ తరిగింది నెమ్మదిగా.

ఆ తరుగుదలలో భుజాలవరకూ విరిగి రక్తం మడుగున పడిన బాపూజీ బొమ్మ అనాథలా కనిపించింది.

అట్లాంటి స్థితిన ఉన్న బాపూనూ చూసేటోడు కనిపించలే.

అటు ఓ అడుగు పడిన జాడా లేదు.

బాపూజీ కంటతడిని చూసేందుకొచ్చిన ఆడాళ్లు చిందరవందరగా అయి, బావురుమని ఏడుస్తూ అస్తవ్యస్తంగా ఇళ్లవైపుకు మళ్లారు.

గుండె చేతపట్టుకుని సొలుగుతూ రాంబాయమ్మ కనిపించింది. ఆవిడ చేతనున్న కూరగాయల సంచిని ఎక్కడ విడిచిపెట్టిందో కనిపించలేదు.

* * *

గజగజ వణుకుతూ వస్తున్న తల్లిని చూసిన బాబు - "గాంధీగారేడుస్తున్నాడు కదూ?" అనడిగాడు - అమాయకంగా, పెన్సిలు చెక్కుకుంటూ.

"ఏడవకేం చేస్తడు?" అని అరుగుపైన చతికిలపడ్డది తల్లి.

దూరంగా చౌరస్తాలో విరిగిన విగ్రహం కళ్లబడి అంతులేని దుఃఖం ఉబికింది. అరుగుపైన పడి దుఃఖం తీరిందాకా ఏడ్చింది. కానీ అది తీరే దుఃఖం కాదు.


## మీకు తెలుసా ?

కేంద్ర మరియు రాష్ట్ర ఆర్థిక సహాయముతో రాష్ట్రంలో అమలులో ఉన్న జాతీయ సామాజిక సహాయ పథకములు.

### 1. జాతీయ వృద్ధాప్య పింఛను పథకము (NOAP)

65 సంవత్సరముల వయస్సుకు పైబడి నిరాధారులై జీవనాధారము లేని వృద్ధులకు నెలకు రూ. 75/- వంతున పింఛను మంజూరు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిఫార్సు చేసిన అర్జీలను పరిశీలించి రెవెన్యూ డివిజనల్ అధికారి పింఛను మంజూరు చేయుదురు.

### 2. జాతీయ కుటుంబ ప్రయోజన పథకము (NFBS)

కుటుంబ సంవత్సర ఆదాయము రూ. 11,000/- కంటే తక్కువ గల కుటుంబ యజమాని మరణించినచో సహజ మరణమునకు రూ. 5,000/-, ప్రమాద మరణమునకు రూ. 10,000/- ఆ కుటుంబ వారసులకు మంజూరు. మండల రెవెన్యూ అధికారి విచారణ అనంతరము ఆర్థిక సహాయము అందజేయుదురు.

### 3. జాతీయ ప్రసూతి ప్రయోజన పథకము (NMBS)

19 సంవత్సరముల వయస్సునకు పైబడి సంవత్సర ఆదాయము రూ. 11,000/- మించని గర్భిణీ స్త్రీలకు మొదటి రెండు కాన్పులకు రూ. 500/- మంజూరు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారు ప్రాథమిక ఆరోగ్య కార్యకర్తలు సమర్పించిన అర్జీలను పరిశీలించి అర్హులైన వారికి ఆర్థిక సహాయము రెండు దశలలో రూ. 300/- మరియు 200/- ప్రకారం పంపిణీ చేయుదురు.

మరిన్ని వివరములకు సంప్రతించండి

**ప్రాజెక్టు డైరెక్టరు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, కడప**